క్లుప్తంగా

జోరుగా ఉపాధి పనులు


పని చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడు గ్రామంలోని తెలుగుగంగ ఉప కాలువ పూడికతీత పనులు ఉపాధి హామీ పథకంలో జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని 50 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఈ పనితోపాటు భూముల అభివృద్ధి, చెరువుకట్టపై చెట్టుపుట్టలను తొలగించడం తదితర పనులను చేస్తున్నారు. ఈ పనులు నెలరోజులపా టు చేస్తామని టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ తెలిపారు. కూలీలకు రోజుకు రూ.250 కూలీ గిట్టుబాటు అవుతోంది. ఎండ వేడిమి ఉన్నా కూలీలు పనులను హుషారుగా చేస్తున్నారు. సకాలంలో కూలీ డబ్బులు ఇవ్వాలని కూలీలు కోరుతున్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు


సర్వేలో పాల్గొన్న జిల్లా ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్

సత్యవేడు: మండల పరిధిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించేందుకు ఐఈఆర్టీ వెంకటరత్నం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. సోమవారం జిల్లా ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి పుదుకుప్పం, సీతారాంపేట, మదనంబేడు, ఆంబాకం, సత్యవేడు ఉళవచేనులలో సర్వే నిర్వహించారు. ఐదుగురు పిల్లలను గుర్తించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించి శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 కె.ఉషా తదితరులు పాల్గొన్నారు.

కూలీల శాతాన్ని పెంచాలి


మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

ఏర్పేడు: ఉపాధిహామీ పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలని ఈజీఎస్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉపాధిహామీ మండల కార్యాలయంలో సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఏర్పేడు మండలంలో ప్రతి రోజు 4 వేలమంది కూలీలు పనులు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కూలీలను పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనుల్లో నాణ్యతను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, జేఈ బాలాజీ రావు, సాంకేతిక సహాయకులు మనోహర్, రవీంద్రుడు, పట్టాభిరెడ్డి, బీఎఫ్‌టీలు కల్పన, వెంకటాద్రి పాల్గొన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

పిచ్చాటూరు: ఈ నెల 25న శనివారం పిచ్చాటూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ హెచ్ రేఖ అధ్యక్షతన ఈ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పాఠశాలకు చేరిన నోట్ పుస్తకాలు


నోట్ పుస్తకాల వద్ద ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు 18948 నోట్ పుస్తకాలు చేరినట్లు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులందరికి నోట్‌బుక్స్‌ను అందజేస్తామని, ఈలోపు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేస్తామన్నారు. లారీలో ఉన్న వచ్చిన ఈ నోట్ బుక్స్‌ను పాఠశాల గదిలో భద్ర పరిచారు. త్వరలోనే పాఠ్య పుస్తకాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు ప్రసూన, ఈశ్వరమ్మ, కృష్ణయ్య, లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వంగచెట్టు


వంకాయలు

వంగ పంటతో అధిక లాభాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, కారణి, వెస్టువరత్తూరు, గాజులపెళ్లూరు, జీఎన్‌కండ్రిగ, ఆర్‌అనంతాపురం, పూసలపల్లి, నెలవాయి, కల్లివెట్టు, ఆలత్తూరు, పార్లపల్లి, పల్లమాల గ్రామాల్లో రైతులు వంగ పంటను సాగు చేసి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. ఈ గ్రామాల్లోని చెందిన 66 మంది రైతులు 113 ఎకరాల్లో వం గపంటను సాగు చేస్తున్నారు. వంగ మొక్కల పెంపకం కోసం విత్తనాలను చెన్నైలోని కోయంబేడు ప్రాంతంలోని షాపుల నుండి తీసుకొస్తారు. విత్తనాలను నీటిలో ఒకరోజు నానబెట్టి పొలంలో చల్లుతారు. నెలరోజుల తర్వాత నారును పెరికి పొలంలో నాటుతారు. ఆరుతడి పంట కావడంతో మెట్టభూముల్లోనే వంగ పంటను ఎక్కువగా సాగు చేస్తారు. వంగ నారుని ఎకరాకు 1500 మొక్కలు నాటిన, తర్వాత నెలరోజులకు కాపునకు వస్తాయి. ఐదు నెలల పాటు వంకాయలను కాస్తాయి. వంగ నారు నాటినప్పటి నుండి ఎకరాకు సంవత్సరానికి రూ.20 వేలు ఖర్చు అవుతుంది. ఎకరాకు లక్ష రూపాయలు వస్తోంది. అన్ని ఖర్చులు పోను రూ.80 వేలు మిగులుతాయి. మంచి ధర వస్తే ఆదాయం ఇంకా పెరుగుతుంది. వంకాయలకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు చెన్నైలోని కోయంబేడు కూరగాయల మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతారు. చెన్నైలోని ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తారు. ఆరుతడి పంట కావడంతో విద్యుత్ వినియోగం తగ్గుతుంది. కూలీలతోను ఇబ్బంది ఉండదని రైతులు అంటున్నారు. వంగ సాగుతో అధిక లాభాలు వస్తుండడంతో రైతులు మక్కువ చూపుతున్నారు. ఉద్యావనశాఖాధికారులు వంగ పంటకు ప్రోత్సాహకాలను అందిచాల్సి ఉంది.


వంకాయలను కోస్తున్న రైతులు


వంకాయల బస్తాలు

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


సేనాపతి ఉత్సవంలో విష్వక్సేనుడు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం సేనాపతి ఉత్సవంతో అంకురార్పణ చేశారు. సేనాపతి ఉత్సవంలో విష్వక్సేనుడు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడవీధులలో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం గంట, నైవేద్యం తదితర కార్యక్రమాలను పూర్తి చేశారు. స్థానిక భావనారుషి ఆలయం నుండి పద్మశాలీలు కొడి పార్వ వస్త్రాన్ని మేళ తాళాలతో ఆలయ అర్చకులు సమర్పించారు. సేనాపతి ఉత్సవంలో భాగంగా మృత్సంగ్రహణం, పుట్టమట్టిని పాలికలో నింపి నవధాన్యాలని మొలకెత్తించే కార్యక్రమాలను అర్చకులు ఆలయంలోని ప్రత్యేక హోమశాలలో చేపట్టారు. బ్రహ్మోత్సవాలలో ఉత్సవర్ల ఊరేగింపు కొనసాగే వీధుల స్థితిగతుల పర్యవేక్షణకు విష్వక్సేనుడు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరించారు.

నేడు ధ్వజారోహణం

ఆలయ అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాస రాఘవభట్టాచార్య, నరసింహభట్టాచార్యులు మాట్లాడుతూ మంగళవారం వేకువ జామున 4 గంటలకు సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలను పూర్తి చేసి, 7.30 గంటలకు మాడవీధుల్లో దిక్పాలకులను బలపీఠాలలో ఆవాహనం చేసి, 9.45 గంటల్లోపు మిథున లగ్నంలో గరుడాళ్వార్ చిత్రపటం ఉన్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింపచేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఉదయం 10 గంటలకు ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు తిరుమంజనం, సాయంత్రం 5.30 నుండి అరగంట పాటు స్వామివారి ఊంజల్‌సేవ నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 7 గంటలకే స్వామి వారు పెద్దశేష వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో ఊరేగింపునకు బయల్దేరుతారని పేర్కొన్నారు.

దుకాణ సముదాయ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ధర్మరాజులస్వామి ఆలయం వద్ద రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న దుకాణ సముదాయాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయమైన ధర్మరాజులస్వామి ఆలయం వద్ద రూ.40 లక్షల వ్యయంతో దుకాణ సముదాయం పాలకమండలి సమావేశం తీర్మాణం చేశామన్నారు. ప్రస్తుతం పునాది పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులే, కాంట్రాక్టర్లకు సూచించారు. దీని వల్ల ఆలయ ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు వేణుగోపాల బాలాజీ, కాంట్రాక్టర్ భాస్కర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీ కార్యాలయం సందర్శన


విద్యాకానుక పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి

నాగలాపురం: మండల విద్యా వనరుల కేంద్రాన్ని సోమవారం జిల్లా సెక్టోరియల్ అధికారి రామచంద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బాబయ్య కొత్తగా నమోదైన పిల్లల వివరాలను ఆయనకు తెలియజేశారు. ప్రస్తుతానికి నోటు పుస్తకాలు వచ్చాయని తెలిపారు. అనంతరం జిల్లా ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఐఈ ఉపాధ్యాయులు జయపాల్, వసంత, ఎం.ఆర్.సి. శివయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ



పిచ్చాటూరులో ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

పిచ్చాటూరు: గిరిజన కాలనీలో ఓ స్వచ్ఛంద సంస్థ సోమవారం దివ్యాంగులకు ట్రైసైకిళ్లను ఉచితంగా పంపిణీ చేసింది. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు కావాల్సిన పరికరాలు, యంత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. పిచ్చాటూరుతో పాటు నింద్ర, నాగలాపురం, విజయపురం మండలాల్లో సైతం తమ సేవా కార్యక్రమాలను విస్తరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ చైర్మన్ వసంత, సిబ్బంది లోకేష్, బాలక్రిష్ణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పురపాలకసంఘ సిబ్బంది


పురపాలకసంఘ కమిషనర్ రమేష్‌బాబును సన్మానిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయంలో కమిషనర్ రమేష్‌బాబు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయనను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన చేత కేక్‌ను కట్ చేయించారు. అనంతరం సిబ్బంది మాట్లాడుతూ ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, ఉమామహేశ్వరరావు, మధుసూదన్‌రెడ్డి, లలిత, సింధు, లలిత, ప్రియాంక, రవికాంత్, బాలచంద్రయ్య, సురేష్, వంశీకృష్ణ జావిద్, హుస్సేన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్న కొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న జ్ఞానాంబవారి మధురెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలో సోమవారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు జ్ఞానాంబవారి మధురెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. అదేవిధంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమాని వంకాయల సిద్దులయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని అంబలిస్వామి ఆశ్రమం వద్ద కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. అలాగే పెండ్లిమండపం వద్ద జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు.

అపూర్వ సమ్మేళనం

శ్రీకాళహస్తి: పట్టణంలోని భాస్కరపేట పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో 1986–87లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మందల బాలాజీ, బాబు, బి.చిరంజీవి మాట్లాడుతూ పాఠశాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిరువణ్ణామలైకి ఆర్టీసీ సర్వీసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నుంచి తిరువణ్ణామలైకి పౌర్ణమిని పురస్కరించుకుని 22వ తేదీన ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు స్థానిక డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 5.30, 10, 11.45 గంటలకు బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.350 చార్జీ అని తెలిపారు. అదేవిధంగా శ్రీకాళహస్తి ఓపీఆర్‌ఎస్‌లో రిజర్వేషన్ సౌకర్యం ఉందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7382880178, 7382880239 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వెలుగులు నింపిన జాతరలు



డీకే పాళెంలో బల్బు అమర్చుతున్న కార్మికుడు, పడివేటమ్మ ఎస్టీ కాలనీలో బల్బు మారుస్తున్న ఉపసర్పంచ్

నారాయణవనం: సాంప్రదాయాలతో సామూహికంగా నిర్వహించే గంగమ్మ జాతరలతో గ్రామాల వీధులు వెలుగులతో నిండి, మురుగు కాలువలు శుభ్రపడ్డాయి. గతంలో గ్రామాలలో బల్బులతో ఏర్పాటు చేసిన వీధి దీపాల స్థానంలో ఎల్ఈడీ దీపాలను ప్రభుత్వమే అమర్చి, మొత్తాన్ని పంచాయతీల నుండి వసూలు చేసుకుంది. కాంట్రాక్టర్ మాడిన బల్బులను మార్చకపోవడం, విడి భాగాల ధరలు ఎక్కువడా ఉండడంతో సర్పంచ్‌లు వీధి దీపాలను ఆర్చడానికి విముఖత చూపేవారు. దీనికి తోడు పంచాయతీలకు ఆదాయం అంతంత మాత్రమే కావడతో మాడిన ఎల్ఈడీ బల్బులను మార్చకపోవడంతో వీధుల్లో అంధకారం నెలకొనేది. వర్షాలతో కాలువలను పొంగి పారినప్పుడు, జ్వరాలు ప్రబలే సందర్భాలలోనే కాలువలను గ్రామీణ ప్రాంతాలలో అధికారులు చొరవ తీసుకుని శుభ్రం చేస్తుంటారు. అయితే ఎన్నికలు అనంతరం మండలంలోని పలుగ్రామాలలో జాతర సందడి నెలకొంది. దీంతో సర్పంచ్‌లు మాడిపోయిన వీధి దీపాలను మార్చడంలో, మురుగు కాలువలను శుభ్రం చేయడంలో నిమగ్నమై ఉన్నారు. దీంతో ప్రజలు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.


డీకే పాళెంలో కాలువ శుభ్రం చేస్తున్న కార్మికులు

శేష వాహనంపై చెన్నకేశవస్వామి


శేషవాహనంపై విహరిస్తున్న చెన్నకేశవస్వామి

శ్రీకాళహస్తి (తొట్టంబేడు): శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం స్వామి, అమ్మవారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. రాత్రి సర్వాలంకార భూషితుడైన స్వామివారు మంగళ వాయిద్యాల నడుమ శేష వాహనంపై విహరించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయంలోని నందీశ్వర స్వామికి శ్రీ వాల్మీకీశ్వర స్వామికి ఏక కాలంలో పుజలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు తమిళనాడులోని తిరువళ్లూరుకి చెందిన బీజేపీ నాయకులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందించారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి, కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్ర రెడ్డి, పాలక మండలి సభ్యులు ఆనందయ్య, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

పిచ్చాటూరులో...

పిచ్చాటూరు: సిద్ధిరాజుకండ్రిగ శ్రీ గౌరీ సమేత సోమనాథేశ్వరాలయం, కీళపూడిలోని శ్రీ జలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో మహా ప్రదోష పూజలు సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆలయంలో కొలువుదీరిన పరమేశ్వరునికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి సాయంత్రం పంచామృతాలతో అభిషేకించి, పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణలు చేశారు. అనంతరం మహా హారతి సమర్పించారు. చివరగా శివపార్వతుల ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో కొలువుదీరిన గౌరీ సమేత శ్రీ సోమనాథేశ్వరునికి, శ్రీ జలకంఠేశ్వర స్వామికి విశేష అభిషేక పూజలు చేసి, అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు పర్యవేక్షించారు.


పిచ్చాటూరు మండలం కీళపూడిలో విశేష అలంకరణలో శ్రీనందీశ్వరుడు



పిచ్చాటూరు మండలం సిద్ధిరాజుకండ్రిగ శ్రీ సోమనాథేశ్వరాలయంలో నందీశ్వరునికి హారతి, ooo